## శుభాకాంక్షల వెల్లువ

రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న నారాయణరెడ్డిని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, అబ్దుల్లాపూర్‌మెట్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనవెంట ఆ సంఘం రాష్ట్ర నాయకులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

-అబ్దుల్లాపూర్‌మెట్

## మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

కౌన్సిల్ సాధారణ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధా

తుర్కయాంజాల్, అక్టోబర్ 29 : మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తుర్కయాంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధా అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ సాధారణ సమావేశం రాగన్నగూడ వార్డు కార్యాలయంలో చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మున్సిపాలిటీ నూతన కార్యాలయాన్ని రాగన్నగూడ సర్వే నం.471లో ఎకరా స్థలంలో నిర్మించడానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ హరిత, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశికె అయిలయ్య, కౌన్సిలర్లు సంగీత, ఉదయశ్రీ, అనురాధ, మల్లేశ్, రవీందర్‌రెడ్డి, శివలింగంగౌడ్, కమిషనర్ అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పనుల పూర్తి బాధ్యత అధికారులదే..

**కౌన్సిల్‌లో 45 అంశాలకు ఆమోదం**

**మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీ**

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 29: మున్సిపాలిటీలోని వార్డుల్లో సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీ అన్నారు. మంగళవారం పెద్దఅంబర్‌పేటలోని ఓ ఫంక్షన్ హాల్ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజెండాలోని 45 అంశాలపై చర్చించి, ఆమోదం తెలిపారు. వార్డుల్లో డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్లు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన పనులు చేపట్టాలని సూచించారు. సకాలంలో పనులు పూర్తయ్యేలా చూసే బాధ్యత అధికారులదేనని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జయశ్రీ, చిత్రంలో వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి

# మా భూములను లాక్కోవద్దు..

- 70 ఏండ్ల నుంచి సాగు చేస్తున్నాం..
- ప్రభుత్వం భూములను గుంజుకుంటే బతికేదెట్ల
- వంద ఎకరాలను సాగు చేసుకునే బడుగు దళిత కుటుంబాలే
- ఎమ్మెల్యే కాలె యాదయ్యకు మొరపెట్టుకున్న బాధితులు
- ఆ భూముల జోలికి వెళ్లొద్దని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు
- సీఎం దృష్టికి తీసుకెళ్తా : ఎమ్మెల్యే యాదయ్య



భూ బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్, అక్టోబర్ 29 : 70ఏండ్ల నుంచి భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం.. కబ్జా మీద ఉంటూ భూమి మీద ఆధారపడి జీవిస్తున్నాం. భూమి శిస్తు కూడా చెల్లించాం.. అప్పటి పటేల్ పట్వారీ వ్యవస్థ ఉండటంతో ఆ భూములను రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించకుండా కుట్ర చేశారు. భూమిని సాగు చేసుకుంటున్న వారంతా దళిత కుటుంబాలే. ఇప్పుడు గోశాల పేరుతో భూమిని గుంజుకుంటే మేము బతికేదెట్ల అంటూ బాధితులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామ రెవెన్యూలో 180 సర్వే నంబర్‌లో ఉన్న 100 ఎకరాల్లో గ్రామానికి చెందిన 50 దళిత కుటుంబాలు 70 ఏండ్ల నుంచి కబ్జాలో ఉంటూ పంటలు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తమ భూములు అధికారులు గుంజుకుంటూన్నారని తమకు న్యాయం చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల విన్నపంతో మంగళవారం ఆయన తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం మా భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తుందని తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు. గోశాలకు తమ భూములను ఇవ్వాలని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఎలాగైనా తమకు న్యాయం చేయాలని భూ బాధితులు ఎమ్మెల్యే సమక్షంలో తహసీల్దార్ గౌతంకుమార్‌కు వినతి పత్రం అందించారు.

**ఆ భూముల జోలికి వెళ్లొద్దు : ఎమ్మెల్యే యాదయ్య**

దళితులు సాగు చేసుకుంటూ జీవిస్తున్న భూముల జోలికి వెళ్లొద్దని రెవెన్యూ అధికారులను ఎమ్మెలే యాదయ్య ఆదేశించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని భూ బాధితులకు భరోసా ఇచ్చారు. తమ కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా సీఎంతో మాట్లాడుతానని, ఎవరు కూడా ఆందోళన చెందవద్దని., అప్పటి వరకు అధికారులు వారి జోలికి రావద్దని ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. బాధితులతో పాటు స్థానిక నాయకులు టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు మహేందర్‌ముదిరాజ్, రాజుగౌడ్, కుమ్మరి రాము, రమేశ్, శ్రీనివాస్ ఉన్నారు.

## పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

మొయినాబాద్, అక్టోబర్29: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కృష్ణారెడ్డిలకు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. దామోదర్‌రెడ్డి సమక్షంలో మొయినాబాద్ మండల తెలంగాణ పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అబుద్ హమీద్, ప్రధానకార్యదర్శి నారాయణ పీఆర్‌టీయూటీఎస్‌లో చేశారు. యూటీఎఫ్ కార్యదర్శి రేష్మ సైతం పీఆర్‌టీయూలో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను దీపావళి కానుకగా చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్, సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు, శేరిలింగంపల్లి పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడు హనుమంతు, ప్రధానకార్యదర్శి రవీందర్‌రెడ్డి, జీహెచ్ఎం రేణుక, మండల విద్యాధికారి వెంకటయ్య, సంఘం నాయకులు శివకుమార్, యాదగిరి, రాములు, వేణుగోపాల్, సంజీవన్‌కుమార్, లక్ష్మణ్, వినోద్‌కుమార్, నారాయణ, భీమ్లానాయక్, మంజూల, వినయ్‌బాయి, కవితారాణి, ఉమారాణి, శ్రీలత, రేష్మ, రాములునాయక్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్‌లో చేరుతున్న వివిధ ఉపాధ్యాయ సంఘం నాయకులు

కడ్తాల్ : మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు రేవంత్‌గౌడ్

**పెండింగ్ స్కాలర్‌షిప్స్‌ను మంజూరు చేయాలి**

కడ్తాల్ : విద్యార్థులకు చెల్లించాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీఎస్ఎస్‌వో మండల అధ్యక్షుడు పాలకూర్ల రేవంత్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని చరికొండ గ్రామంలో నిర్వహించిన టీఎస్ఎస్‌వో సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచినా విద్యార్థులను పట్టించుకున్న నాయకుడేలేరని విమర్శించారు. కళాశాలలకు ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో ఆయా కళాశాలల యాజమాన్యాలు వేలాది మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించడంలేదన్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులు రూ.7,500 కోట్లను వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున్న నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎస్ఎస్‌వో సభ్యులు పాల్గొన్నారు.

## దుకాణాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

**ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలి**

**చేవెళ్ల ఏసీపీ కిషన్‌గౌడ్**

షాబాద్, అక్టోబర్ 29: దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలికంగా పటాకుల దుకాణాలను ఏర్పాటు చేసేవారు సంబంధిత పోలీస్ అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని చేవెళ్ల ఏసీపీ కిషన్‌గౌడ్ సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పటాకుల దుకాణాలు ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అందుకుగాను సంబంధిత సబ్-డివిజన్ పోలీసు అధికారి కార్యాలయంలో సంప్రదించాలని, దుకాణదారులు ఎవరైనా పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా పటాకుల దుకాణాలను ఏర్పాటు చేసినట్లయితే వారిపై ఎక్స్‌ప్లోజివ్ యాక్టు 1884 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ, జనావాసాలకు దూరంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఖాళీ ప్రదేశానికి సంబంధించిన స్థల యజమాని నుంచి ఎన్.ఓ.సి సర్టిఫికెట్ పొంది ఉండాలన్నారు. దుకాణానికి మధ్య వ్యత్యాసం 3 మీటర్లు, రెసిడెన్షియల్/గృహనిర్మాణాలకు 50 మీటర్ల దూరంలో ఉండాలని, జనాలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఎలాంటి పటాకుల దుకాణాలు ఏర్పాటు చేయరాదన్నారు. ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు.

## షాద్‌నగర్ ఆర్డీవోగా సరిత

షాద్‌నగర్‌టౌన్, అక్టోబర్ 29: షాద్‌నగర్ ఆర్డీవోగా సరిత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ ఎన్నికల సంఘం విభాగంలో విధులు నిర్వహించిన ఆమె బదిలీలో భాగంగా షాద్‌నగర్ ఆర్డీవోగా వచ్చారు. ఆర్డీవో సరితను ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ పార్థసారథి ఘనంగా సన్మానించారు. ఇదివరకు షాద్‌నగర్ ఆర్డీవోగా బాధ్యతలు నిర్వహించిన వెంకటమాధవ రావు మహబూబాబాద్ డీఆర్‌వోగా బదిలీ అయ్యారు.

## రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

షాద్‌నగర్, అక్టోబర్29: రోడ్డు ప్రమాదంలో ఓ కార్మికుడు మృతిచెందిన ఘటన మంగళవారం షాద్‌నగర్ బైపాస్ రోడ్డులో జరిగింది. షాద్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన సూరజ్‌కుమార్, అతడి బావ, చందన్‌కుమార్ (30) హైదరాబాద్‌లోని రామంతాపూర్, చర్చి కాలనీలో నివాసం ఉంటూ వెల్డింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. విధుల నిమిత్తం బైక్‌పై షాద్‌నగర్ వైపు వస్తుండగా, బైక్ షాద్‌నగర్ బైపాస్ వద్దకు రాగానే లారీ వెనుక నుంచి వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చందన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలపాలైన సూరజ్‌కుమార్‌ను షాద్‌నగర్ సర్కారు దవాఖానకు తరలించారు. లారీ డ్రైవర్ తన వాహనాన్ని ఆకస్మాత్తుగా ఎడుమవైపునకు తిప్పడంతోనే రోడ్డు ప్రమాదం చోటుచేసుకుందని, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపిన లారీ డ్రైవర్ పెరుమాల్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ బల్‌రామ్‌నాయక్ తెలిపారు.

## ఆర్డీవోకు ఘన సన్మానం



కందుకూరు ఆర్డీవోగా జగదీశ్వర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆర్డీవోను ఆయన కార్యాలయంలో తలకొండపల్లి తహసీల్దార్ నాగార్జున మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

- కడ్తాల్, అక్టోబర్ 29

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ఆదిబట్ల, అక్టోబర్ 29: డివైడర్‌ను ఢీకొని బైక్ పైనుంచి కింద పడి విద్యార్థి మృతి చెందిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొంగుళూరు నాగార్జునసాగర్ రహదారిపై మంగళవారం జరిగింది. ఆదిబట్ల ఎస్ఐ బాలరాజ్ తెలిపిన వివరాల ప్రకారం బాలాపూర్ మండలం, మల్లాపూర్ గ్రామానికి చెందిన మేఘావత్ పవన్(21) బీఎస్సీ చదువుతున్నాడు. తన స్నేహితులతో కలిసి బయటికి వెళుతున్నానని తన తండ్రితో చెప్పి వెళ్లాడు. పవన్ తన స్నేహితుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా బొంగుళూరు సమీపంలో డివైడర్‌కు బైక్ ఢీకొని రోడ్డు పై పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయాలైన పవన్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ దవాఖానకు పోస్టుమార్టం నిమిత్తం తరలించామని తెలిపారు. మృతుడి తండ్రి మేఘావత్ శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## 3న సమ్మేళనం

ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 29 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిబట్లలో నవంబర్ 3న నిర్వహించనున్న ధర్మసమాజ్‌పార్టీ సమ్మేళనం, మొదటి ప్లీనరీ సమావేశానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు తులసిగారి రవీందర్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పార్టీ ప్లీనరీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అమరేందర్, నాగార్జున, శేఖర్, భవాని శేఖర్, భాస్కర్, శ్రీకాంత్, లింగస్వామి, మహిపాల్, రంజిత్, శ్రావణ్, భరత్, వంశీ, లింగస్వామి పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల అమల్లో విఫలం

మొయినాబాద్, అక్టోబర్29: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి అమల్లో పూర్తిగా విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు మామిడి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కనకమామిడిలో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఒక్కరికి కూడా ప్రభుత్వ పథకం అందిందని చెప్పిన దాఖలాలు లేవని అన్నారు. 90 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు మోసపోయి కాంగ్రెస్‌కు ఓటు వేశారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్, యాదయ్యయాదవ్, లక్ష్మీపతియాదవ్, శ్రీనివాస్, శివశంకర్, రవీందర్‌రెడ్డి, శ్రీధర్, మహేందర్‌రెడ్డి, రవీందర్, బీంచందర్‌గౌడ్ పాల్గొన్నారు.

## క్యూబాపై నిర్బంధాన్ని ఎత్తివేయాలి

ఆమనగల్లు, అక్టోబర్ 29: క్యూబాపై విధించిన క్రిమినల్ నిర్బంధాన్ని ఎత్తివేయాలని సీపీఎం ఆమనగల్లు ఏరియా కన్వీనర్ కానుగుల వెంకటయ్య డిమాండ్ చేశారు. నిర్బంధాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూబాపై అమెరికా విధించిన ఆర్థిక, వాణిజ్య దిగ్బంధానికి ముగింపు పలకాలని ఆయన అన్నారు. క్యూబా ఆర్థికంగా 164.14 బిలియన్ డాలర్లను నష్టపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య, వివిధ సంఘాల నాయకులు చెన్నయ్య, రమేశ్, పద్మ, వరలక్ష్మి, రమాదేవి, మంజుల, నాగమణి, సత్యమ్మ, దుర్గ, శిరీష, జయమ్మ పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు పనులు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 29 : గత ప్రభుత్వ హయాంలో మంజూరైన డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ద్వారా రూ. 15 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను మంగళవారం పంచాయతీ రాజ్ డీఈ ఎండీ సయ్యద్ అమీద్‌అబ్బాస్, ఏఈ సూర్యతేజ గత పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామపంచాయతీ సింగరేణి కాలనీకి రూ. 15లక్షలు గత ప్రభుత్వ హయాంలో మంజూరు కాగా, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఆ పనులను నిర్వహించలేదు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఎర్రవెల్లి లతశ్రీగౌ రాశంకర్‌చారి, మాజీ ఎంపీటీసీ కేశెట్టి వెంకటేశ్, మాజీ ఉప సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, కాలనీవాసులు రంగారెడ్డి, జంగయ్య, శ్రీశైలం, ప్రవీణ్ పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సంక్షేమమే లక్ష్యం

**ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ వెంకట్రాంరెడ్డి**

**నవంబర్ 5న ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం**

పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో నినాదాలు చేస్తున్న ఉద్యమకారులు

షాద్‌నగర్, అక్టోబర్29: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఉద్యమకారుల సంక్షేమ సంఘం అడ్‌హక్ కమిటీ చైర్మన్ పి. వెంకట్రాంరెడ్డి అన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో ఉద్యమకారుల సంక్షేమ సంఘం తాత్కాలిక అడ్‌హక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్న అనంతరం మాట్లాడారు. క్షేత్రస్థాయిలో సామాన్య ప్రజలు సహితం తెలంగాణ కోసం ఉద్యమించారని, ఎంతో మంది ఉద్యమకారులు ముందుండి ఉద్యమాన్ని నడిపించడంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఉద్యమకారులను ప్రత్యేకంగా గుర్తించడంతో పాటు వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేయాలని కోరారు. ఉద్యమకారుల బాగోగులను తెలుసుకునేందుకు నవంబర్5న ఫరూఖ్‌నగర్ మండలం నాగులపల్లి గ్రామంలోని వసంతరెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా అదే రోజు తొలిదశ తెలంగాణ ఉద్యమకారులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. సంఘం తాత్కాలిక నూతన కమిటీని ఎన్నుకున్నామని సలహాదారులుగా కె. నర్సింహారెడ్డి, రాంబాల్‌నాయక్, మంగులాల్‌నాయక్, ఎమ్మె సత్తయ్య, గౌరవ అధ్యక్షులుగా ప్రభాకర్, మిట్టునాయక్, వైస్ చైర్మన్‌గా యాదయ్య, రవి, కన్వీనర్లుగా వెంకటేశ్ గౌడ్, నారాయణ, కో కన్వీనర్లుగా ఎండీ సిరాజ్, నర్సింహులు, కో ఆర్డినేటర్‌గా దిలీప్‌కుమార్ ఎన్నికయ్యారని వివరించారు.

## పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

షాబాద్, అక్టోబర్ 29: రైతులు తమ పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లి, గొల్లూరుగూడ, దామర్లపల్లి, లింగారెడ్డిగూడ గ్రామాల్లో వైద్యసిబ్బందితో కలిసి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీనివాస్, కృష్ణమూర్తి, సుధాకర్, శ్రీకాంత్, బలరాం, రాణి, రైతులు పాల్గొన్నారు.

పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

## అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు

మల్లేశ్, స్వరూప దంపతులను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

కడ్తాల్, అక్టోబర్ 29: అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ఎప్పుడు గుర్తింపు లభిస్తుందని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లేశ్ మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో సుజాత అధ్యక్షతన మల్లేశ్ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ, బదిలీలు సహజమని తెలిపారు. అనంతరం మల్లేశ్, స్వరూప దంపతులను అధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ ఎంపీటీసీ రాములుగౌడ్, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు అంజి, మహేశ్, భీక్యానాయక్, మహేశ్‌గౌడ్, జగన్, శ్రీకాంత్, ఎంపీవో విజయ్‌కుమార్‌పాల్, సూపరింటెండెంట్ మహాలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్లు ప్రతిమాదేవి, వినయ్‌రెడ్డి, సమీర్ పాల్గొన్నారు.

## బస్టాప్ ఏర్పాటు చేయాలి

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 29 : మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో బస్టాప్ ఏర్పాటు చేయాలని సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో హయత్‌నగర్-1, -2 డిపోల డీఎంలకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. కాలనీలో 180 కుటుంబాలకు ఉన్నాయని, నగరంలోని పలు చోట్ల ఉద్యోగ రీత్యా వెళ్లి వస్తున్నారు. బస్టాప్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. కాలనీలో బస్టాప్ ఏర్పాటు చేసి ప్రయాణికుల సమస్యను తీర్చాలని కోరారు. ఆర్టీసీ అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వీరివెంట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపీశంకర్‌యాదవ్, సభ్యులు యాకూబ్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎండీ సాధిక్, డబుల్‌బెడ్‌రూం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి అవినాశ్‌సింగ్, కోశాధికారి కె.శ్రీనివాస్, ఆర్గనైజర్ సోము, అడ్వైజర్ రాజేశ్, సాయి ఉన్నారు.

ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

## ఘనంగా ధన్వంతరి జయంతి

కడ్తాల్, అక్టోబర్ 29: మండలంలో ఆయుర్వేద వైద్య పితామహుడు ధన్వంతరి జయంతిని మంగళవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నాయీబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన ధన్వంతరి చిత్రపటానికి, సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధన్వంతరి ప్రపంచానికి ఆయుర్వేద వైద్యాన్ని పరిచయం చేశారని, వైద్యరంగంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు లక్ష్మయ్య, కార్యదర్శి మహేందర్, కార్యవర్గ సభ్యులు నర్సింహ, జంగయ్య, కృష్ణయ్య, శంకరయ్య, సత్తయ్య, శ్రీనివాస్, శివ, అంజయ్య, వెంకటేశ్, గణేశ్, మురళీ, కుమార్, సిద్ధూ, రాజు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

విద్యార్థులకు డిక్షనరీ పుస్తకాలను అందజేస్